సాక్షి
జగిత్యాల
శుక్రవారం ౹ 20 ౹ జనవరి ౹ 2023



## సమస్యలు పరిష్కరించండి

జగిత్యాల: సమస్యలపై అంగన్‌వాడీ కార్యకర్తలు సంక్షేమాధికారికి విన్నవించారు.



## గ్రామాల్లో విజిలెన్స్ తనిఖీలు

పెగడపల్లి: ఆరవెల్లి, అయితిపల్లిలో విజిలెన్స్ అధికారి చిన్నయ్య తనిఖీలు చేశారు.



గరిష్ఠం/కనిష్ఠం
31.0/17.0

## వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి పూట ఎండగా ఉంటుంది.

# నలువైపులా దిగ్బంధం

- రోడ్లపైనే వంటావార్పు
- రహదారులపై బైఠాయింపు
- నిలిచిన వాహనాల రాకపోకలు
- ఉధృతరూపం దాల్చిన 'మాస్టర్ ప్లాన్' నిరసనలు



హస్నాబాద్ వద్ద జగిత్యాల- నిజామాబాద్ రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు



ధరూర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



తిప్పన్నపేటలో రైతులతో కలిసి ధర్నా చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పలువురు నాయకులు



హస్నాబాద్ వద్ద వంటావార్పు చేస్తున్న రైతులు



నర్సింగాపూర్ గ్రామపంచాయతీకి తాళం

జగిత్యాలరూరల్: గ్రామాల్లో చేపట్టిన మాస్టర్ ప్లాన్ మంటలు గురువారం జిల్లా కేంద్రానికి చేరుకున్నాయి. మాస్టర్ ప్లాన్ పరిధిలోని వివిధ జోన్లలో చేర్చిన వ్యవసాయ భూముల యజమానులు ఏకతాటిపైకి వచ్చి జిల్లా కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని ఆందోళనలు ఉధృతం చేశారు. ఇందుకోసం ప్రణాళిక బద్ధంగా నిరసన తెలిపారు. పట్టణ శివారులోని హస్నాబాద్, అంబారిపేట, లింగంపేట రైతులు నిజామాబాద్ - జగిత్యాల ప్రధాన రహదారిపై ధరూర్ పెద్దకాలువ వద్ద ధర్నా చేశారు. ధరూర్, నర్సింగాపూర్ గ్రామాలకు చెందిన రైతులు కరీంనగర్–జగిత్యాల రోడ్డుపై బైఠాయించారు. తిమ్మాపూర్, మోతె గ్రామాల అన్నదాతలు గొల్లపల్లి–జగిత్యాల ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. మొత్తంగా జగిత్యాలకు వచ్చిపోయే ప్రధాన రోడ్లను దిగ్బంధించారు. రోడ్లపైనే వంటావార్పు చేసి సర్కారు, మున్సిపల్ పాలకుల తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

**వంటావార్పుతో నిరసన..**

తిమ్మాపూర్, మోతె గ్రామాల రైతులు ఉదయం 10.30 – మధ్యాహ్నం 2.30 గంటల వరకు నిరసన తెలిపారు. రోడ్డుపై వంటావార్పు చేశారు. తమ భూములను కమర్షియల్, రిక్రియేషన్‌జోన్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. రూరల్ సీఐ కృష్ణకుమార్ వారితో మాట్లాడటంతో ఆందోళన విరమించారు.

**రైతులకు ఎమ్మెల్సీ మద్దతు**

తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట రైతులు చేపట్టిన రాస్తారోకోలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. వారికి మద్దతు తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు జగిత్యాల, మెట్‌పల్లి డీఎస్పీలు ప్రకాశ్, రవీందర్‌రెడ్డి.. జీవన్‌రెడ్డి, రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. రైతులకు మద్దతుగా ఆందోళన చేస్తామని ఎమ్మెల్సీ ప్రకటించారు.

### ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం..

ధరూర్, నర్సింగాపూర్ గ్రామాల రైతులు ధరూర్ పెద్దకాలువ వంతెన వద్ద రోడ్డుపై టెంట్ వేసి నిరసన తెలిపారు. ప్రభుత్వ దిష్టిబొమ్మ వద్ద మద్యం, చెప్పులు, ఇతర తిండి పదార్థాలు ఉంచి రోదిస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం దిష్టిబొమ్మ దహనం చేశారు. పోలీసులు రైతులతో మాట్లాడి ధర్నా విరమింపజేశారు.

### నర్సింగాపూర్ గ్రామపంచాయతీకి తాళం

తమ గ్రామాన్ని మాస్టర్‌ప్లాన్ పరిధి నుంచి తొలగించాలని నర్సింగాపూర్ రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు.

**పోలీసుల బందోబస్తు..**

జగిత్యాలోకి ఎవరూ రాకుండా, పట్టణవాసులు బయటకు ఎవరూ వెళ్లకుండా సమీప గ్రామాల రైతులు నలువైపులా ప్రధాన రహదారులను దిగ్బంధించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీబందోబస్తు ఏర్పాటు చేశారు. అనువణువూ క్షుణ్ణంగా పరిశీలిస్తూ పహారా కాశారు. జగిత్యాల, మెట్‌పల్లి డీఎస్పీలు ప్రకాశ్, రవీందర్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీసు బలగాలను భారీగా మోహరించారు. రైతులను శాంతింపజేస్తూ వ్యూహాత్మకంగా ఆందోళనలు విరమింపజేశారు.

## 'మాస్టర్‌ప్లాన్‌ను సవరిస్తాం'

జగిత్యాల: మాస్టర్‌ప్లాన్‌లో సమగ్ర సవరణలు చేపట్టి, రైతులు, ప్రజలకు నష్టం కలుకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం అభయం ఇచ్చారు. జగిత్యాల పట్టణాభివృద్ధి కోసం ముసాయిదా మాస్టర్‌ప్లాన్‌ను మున్సిపాలిటీ ప్రకటించిందన్నారు. దీనిపై 60రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈనేపథ్యంలోనే జగిత్యాల శివారులోని మోతె, తిమ్మాపూర్, నర్సింగాపూర్, అంబారిపేట, హస్నాబాద్, తిప్పన్నపేట గ్రామాల్లోని కొన్ని వ్యవసాయ భూముల సర్వే నంబర్లు చేర్చారని పేర్కొన్నారు. ఇందుకు భూ యజమానులు ఆందోళనకు గురవుతున్నారని, వారి ఆవేదనను అర్థం చేసుకుని మున్సిపల్ అధికారులతో చర్చించామని వివరించారు. ఈ నేపథ్యంలోనే ముసాయిదా మాస్టర్ ప్లాన్‌ను పూర్తిస్థాయిలో సవరిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాదు.. ఇండస్ట్రియల్, రిక్రియేషన్, సెమీ పబ్లిక్, గవర్నమెంట్ జోన్ల నుంచి వ్యవసాయ భూములు తొలగింపజేస్తామన్నారు. ప్రభుత్వ భూముల్లోనే ఇండస్ట్రియల్, పబ్లిక్, ప్రైవేటు సెక్టార్, రిక్రియేషన్ జోన్‌లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రైతులు ఆందోళన చెందవద్దని మంత్రి సూచించారు.

## అవకతవకలు సరిచేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

జగిత్యాలటౌన్: పోలీసు నియామక ప్రక్రియలో చోటుచేసుకుంటున్న అవకతవకలు సరిచేసి అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ మధు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. మధు మాట్లాడుతూ హైకోర్టు తీర్పు మేరకు మల్టిపుల్ ప్రశ్నలకు 7మార్కులు కలిపి, రన్నింగ్ అర్హత పొంది, లాంగ్ జంపులో అనర్హులైన వారిని మెయిన్స్‌కు అనుమతించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అసంబద్ధ నియమాలతో ఆందోళనకుగురై ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించాలని కోరారు. యూత్ కాంగ్రెస్ జగిత్యాల అసెంబ్లీ అధ్యక్షుడు బాపురెడ్డి, ధర్మపురి అధ్యక్షుడు సింహరాజు, మైనార్టీ అధ్యక్షుడు నేహాల్, పట్టణ అధ్యక్షుడు రాజేశ్, నాయకుడు శివ పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేయాలి

జగిత్యాల: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ మైనారిటీ విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ గురువారం తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 31వ తేదీ వరకు ఈ–పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అప్పటిదాకా వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### వరినాటు వేసిన విద్యార్థులు



నాటు వేస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): స్థానిక మోడల్ స్కూల్‌లో అగ్రికల్చర్ వొకేషనల్ కోర్సు చదువుతున్న విద్యార్థులు గురువారం పొలంలో వరి నాట్లు వేశారు. క్షేత్రస్థాయి చదువులో భాగంగా ట్రెయినర్ రజితతో కలిసి వారు పొలం బాట పట్టారు. అయితే, నాటు ఎలా వేయాలనే అంశంపై రజిత వివరిస్తుండగా విద్యార్థులు వారినాట్లు వేస్తూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసరి నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు సందీప్‌కుమార్, రాజ్‌కుమార్, సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఈనె 31వ తేదీ వరకు నిర్వహించే జంతు సంరక్షణ పక్షోత్సవాల ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ రవి గురువారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జంతు సంరక్షణ కోసం ప్రతీవ్యక్తి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్యాధికారి గోపాలక్రిష్ణమూర్తి, సహాయ సంచాలకుడు నరేశ్, పశువైద్యులు శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, మనీషా, అశోక్‌కుమార్, నాగేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: స్థానిక ఖిలాగడ్డ మైనారిటీ గురుకుల పాఠశాలలో ఐదు నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ గురువారం తెలిపారు. ఐదో తరగతిలో మైనారిటీ, నాన్‌మైనార్టీల నుంచి మొత్తం సీట్లు, ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు మిగులు సీట్లు భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి, అర్హతగల విద్యార్థులు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

### 'జగిత్యాలపై సీఎంకు వివక్ష'

సారంగాపూర్(జగిత్యాల): సీఎం కేసీఆర్ జగిత్యాల జిల్లాపై వివక్షత ఎందుకు చూపుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో కలెక్టరేట్ ప్రారంభం సందర్భంగా సీఎం వరాలు ఇస్తారని జిల్లా వాసులు ఆశగా ఎదురు చూశారని, కానీ, ఒక్క రూపాయి కూడా ప్రకటించలేదన్నారు. ఖమ్మం కలెక్టరేట్ ప్రారంభం సందర్భంగా ప్రతీ గ్రామానికి రూ.10లక్షలు, మేజర్ గ్రామపంచాయతీకి రూ.10కోట్లు, మున్సిపాలిటీకి రూ.50 కోట్ల విడుదల చేస్తామని ప్రకటించి జగిత్యాల జిల్లాపై వివక్ష చూపారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేస్తామని ప్రకటించారని, అంతకు ముందు నిజాం చక్కెర ఫ్యాక్టరీలు తెరవాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ మసర్తి రమేశ్, సింగిల్‌విండో చైర్మన్ పాల్సాని నవీన్‌రావు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

### బకెట్‌లోపడి బాలుడు మృతి



రోదిస్తున్న బాలుడి తల్లి భూమి

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామ శివారులోని ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఒడిశా కార్మికుడి కుమారుడు అవిల్‌తాండి(9నెలలు) గురువారం నీటిబకెట్‌లో పడి మృతిచెందాడు. ఒడిశా రాష్ట్రం జలంగీర్ గ్రామానికి చెందిన మన్సింగ్ తాండి, భార్య భూమి, కుమారుడితో కలిసి ఇక్కడకు వచ్చారు. నర్సింగాపూర్ శివారులోని ఇటుక బట్టీల్లో కొద్దికాలంగా పనిచేస్తున్నారు. గురువారం బాలుడి తల్లి భూమి నిద్రిస్తుండగా బాలుడు అవిల్‌తాండి ఆడుకుంటూ వెళ్లి నీటిబకెట్‌లో పడి ఊపిరి ఆడక మృతిచెందాడు. తండ్రి మన్సింగ్‌తాండి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ తెలిపారు.

# ఆర్టీసీకి సంక్రాంతి బొనాంజా

- తొమ్మిది రోజుల్లో రీజియన్‌లో రూ.13.82 కోట్ల ఆదాయం
- ఈనెల 18న ఒకేరోజు రూ.2.05 కోట్ల ఆదాయం



కరీంనగర్: ఆర్టీసీకి సంక్రాంతి పండుగ కలిసొచ్చింది. ప్రయాణికుల రాకపోకలతో భారీ ఆదాయం సమకూరింది. పండుగ సందర్భంగా ఈనెల 10 నుంచి 18వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడిపించగా.. గతంలో ఎన్నడూ లేని విధంగా తొమ్మిది రోజుల్లోనే రూ.13 కోట్ల 82 లక్షల 60 వేల ఆదాయం సమకూరింది. రీజియన్ పరిధిలో ఈనెల 18న ఒక్క రోజు రూ.2 కోట్ల 5 లక్షల 77 వేల ఆదాయం సమకూర్చుకోవడం గమనార్హం. ఆ ఒక్క రోజే 4 లక్షల 2 వేల 586 కిలోమీటర్లు తిరుగగా 2 లక్షల 11 వేల మంది ఆర్టీసీలో ప్రయాణించగా ఈ ఆదాయం వచ్చింది. కరీంనగర్ రీజియన్ పరిధిలో కరీంనగర్–1, కరీంనగర్–2, గోదావరిఖని, హుస్నాబాద్, హుజూరాబాద్, మంథని, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ డిపోల నుంచి 410 ప్రత్యేక బస్సులను హైదరాబాద్‌కు నడిపారు. ఈ నెల 10 నుంచి 18 వరకు ప్రత్యేక బస్సులు నడిచాయి. ఆర్టీసీ సంస్థ ముందుగానే పండుగ సందర్భంగా ప్రత్యేకంగా చార్జీలు వసూలు చేయమని ప్రకటించడంతో ప్రయాణికులు ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు మొగ్గు చూపారు. పెట్రోల్, డీజిల్ ధరలు సైతం మండిపోతుండడంతో ప్రయాణికులు ఆర్టీసీనే ఆశ్రయించారు. కరీంనగర్ రీజియన్ ఆర్టీసీ అధికారులు హైదరాబాద్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో మకాం వేసి బస్సుల రాకపోకలను పర్యవేక్షించారు. రీజియన్ పరిధిలో ఇంత భారీమొత్తంలో ఆదాయం రావడం ఇదే తొలిసారి కావడం విశేషం.

ఈనెల 10 నుంచి 18 వరకు వచ్చిన ఆదాయం

| తేదీ | ఆదాయం(రూ.లక్షల్లో) |
|---|---|
| 10 | 1,33,94,000 |
| 11 | 1,49,51,000 |
| 12 | 1,71,30,000 |
| 13 | 1,70,18,000 |
| 14 | 1,37,53,000 |
| 15 | 76,25,000 |
| 16 | 1,54,13,000 |
| 17 | 1,83,99,000 |
| 18 | 2,05,77,000 |
| మొత్తం | 13,82,60,000 |

### ఆర్టీసీని ఆదరించాలి..



కరీంనగర్ రీజియన్ పరిధిలో సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక ఆదాయం తెచ్చేందుకు కృషి చేసిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, సూపర్‌వైజర్లకు, డిపో మేనేజర్లకు శుభాకాంక్షలు. ముందస్తు రిజర్వేషన్లతోపాటు అదనపు చార్జీలు వసూలు చేయకుండా, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపి ఆదాయాన్ని సమకూర్చుకోగలిగాం.
– ఖుస్రో షా ఖాన్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్

# కంటి వెలుగు దేశానికే ఆదర్శం





మహిళకు కళ్లద్దాలు పెడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, శిబిరం ప్రారంభిస్తున్న కలెక్టర్ రవి

- రాష్ట్ర సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: కంటి వెలుగు కార్యక్రమం దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర సంక్షేమమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. స్థానిక బ్రాహ్మణ సంఘ భవనంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రెండోవిడత కంటిపరీక్షల కోసం ప్రభుత్వం రూ.250 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వైస్ చైర్మన్ రామన్న, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, వైస్ చైర్మన్ అక్కెనపెల్లి సునిల్‌కుమార్ పాల్గొన్నారు.

**విజయవంతం చేయండి**

జగిత్యాల/జగిత్యాలరూరల్: కంటివెలుగును విజయవంతం చేయాలని కలెక్టర్ రవి కోరారు. జిల్లా కేంద్రంతోపాటు చెర్లపల్లిలో కంటి వెలుగు కేంద్రాలు ప్రారంభించి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్ మకరంద్, ఆర్డీవో మాధురి, డీఎంహెచ్‌వో శ్రీధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోగ శ్రావణి, తహసీల్దార్ నవీన్, సర్పంచ్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు. కాగా, మోరపల్లిలో సింగిల్‌విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ బొల్లె సత్తమ్మ కంటివెలుగును ప్రారంభించారు.

### తొలిరోజు 5,500మందికి నేత్ర పరీక్షలు

జగిత్యాల: జిల్లాలో తొలిరోజు మొత్తం 46 కేంద్రాలు ప్రారంభించారు. 5,500మందికి నేత్ర పరీక్షలు చేశారు. 1,009 మందికి రీడింగ్ గ్లాసులు, 1,300 మందికి పాయింట్ ఆర్డర్ కళ్లద్దాలు పంపిణీ చేశారు. తొలిరోజు శస్త్రచికిత్సలు అవసరమైన వారెవరూ రాలేదని అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 552మంది వైద్య సిబ్బంది నేత్ర పరీక్షల్లో పాలుపంచుకున్నట్లు అధికారులు వివరించారు.

# రచ్చకెక్కిన వైద్యుల విభేదాలు

- గదుల కేటాయింపులో వివాదం
- వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌పై దాడికి యత్నం
- నలుగురు గుర్తు తెలియని వ్యక్తుల పని
- బయటివారేనని అనుమానం
- ఎస్పీకి ఫిర్యాదు
- ఫిర్యాదు వాపసు తీసుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశం



ఆందోళన చేస్తున్న వైద్య విద్యార్థులను సముదాయిస్తున్న వైస్ ప్రిన్సిపాల్

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల డాక్టర్ల మధ్య విభేదాలు తలెత్తాయి. వారి మధ్య ఏకాభిప్రాయం లేకపోవడం వివాదాలకు దారితీస్తోందని, ఈక్రమంలో గొడవలు ముదిరి పాకాన పడి రచ్చకెక్కుతున్నాయని విమర్శలు ఉన్నాయి. ఆస్పత్రిలో సేవలు అందిస్తున్న వైద్యులు.. మెడికల్ కళాశాలలోని అడ్మినిస్ట్రేషన్ భవనంలోనూ తమకు గదులు కేటాయించాలని ప్రిన్సిపాల్‌కు విన్నవించినట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం.. ఆస్పత్రిలో పనిచేస్తున్న వారికి కళాశాల భవనంలో గదులు కేటాయించే అవసరం లేదని మరోవైపు అధికారులు చెబుతున్నారు. వైస్ ప్రిన్సిపాల్ కావాలనే గదులు కేటాయించడం లేదని ఆస్పత్రికి చెందిన ఓ ఇద్దరు డాక్టర్లు పేర్కొంటున్నారు.

**రచ్చకెక్కిన వివాదం..**

- గదుల కేటాయింపు విషయంలో ఆస్పత్రిలోని ఇద్దరు డాక్టర్లు బుధవారం అడ్మినిస్ట్రేషన్ బ్లాక్‌లో వైస్‌ప్రిన్సిపాల్‌తో చర్చించారు.
- గదులు ఎందుకు కేటాయించడం లేదని వైస్ ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.
- ఏదిఏమైనా తమకు గదులు కేటాయించాల్సిందేనని వైస్‌ప్రిన్సిపాల్‌కు వారు విన్నవించినట్లు తెలిసింది.
- అదే సమయంలో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు కళాశాలలోకి ప్రవేశించి వైస్ ప్రిన్సిపాల్‌పై దాడికి యత్నించారు.
- సమాచారం అందుకున్న కళాశాలలోని వైద్య విద్యార్థులు.. ఎందుకు గొడవ చేస్తున్నారని ఆందోళనకు దిగారు.
- దీంతో ఆ ఇద్దరు వైద్యులు అక్కడి నుంచి వెళ్లిపోయారని సమాచారం.
- ఇదే విషయంపై వైస్ ప్రిన్సిపాల్, వైద్య విద్యార్థులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి దాడి యత్నంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**ఫిర్యాదు వెనక్కి తీసుకునేలా..**

- తనను కొందరు వైద్యులు కులం పేరిట దూషించారని వైస్ ప్రిన్సిపాల్ బుధవారం రాత్రి నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- మరోవైపు.. కళాశాలలో చోటుచేసుకుంటున్న ఇలాంటి ఘటనలతో కాలేజీకి చెడ్డపేరు వస్తుందని భావిస్తున్న ఉన్నతాధికారులు.. వైస్‌ప్రిన్సిపాల్ చేసిన ఫిర్యాదును వెనక్కి తీసుకునేలా చర్యలు ప్రారంభించారు.
- డైరెక్టర్ ఆఫ్ కమిషనర్, వైద్య శాఖ కూడా ఫిర్యాదు వెనక్కి తీసుకుంటేనే బాగుంటుందని ఆదేశించినట్లు తెలిసింది.
- అయితే, అనుమతి లేకుండా కళాశాల భవనంలోకి వచ్చిన నలుగురు ఎవరనే దానిపై విచారణ చేపట్టాలని ఆదేశించినట్లు తెలిసింది.

**గదుల కోసమేనా..**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ప్రత్యేకంగా సూపరింటెండెంట్ ఉన్నారు. వైద్య కళాశాలకు ప్రిన్సిపాల్ అధిపతిగా కొనసాగుతున్నారు. వీరంతా సమన్వయంతోనే కళాశాల నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి.. వైద్య కళాశాలకు అనుబంధంగా కొనసాగుతోంది. అయితే, ఆస్పత్రిలోని ఇద్దరు వైద్యులు.. మెడికల్ కాలేజీ భవనంలో గదులు కేటాయించాలని గొడవ చేస్తున్నట్లు తెలిసింది. ఈ వివాదం గదుల కోసమేనా, లేకా ఇంకా ఏమైనా గొడవలు ఉన్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు.. మెడికల్ కాలేజీలో నాణ్యమైన, ఆధునిక వైద్య సేవలు అందించాలని, వైద్య విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే సంజయ్ సూచించినట్లు తెలిసింది. ఇందుకు విరుద్ధంగా కళాశాలలో గొడవలు ఏమిటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

### ఆ నలుగురు ఎవరు?

వైద్య కళాశాలలోకి బయటి వ్యక్తులు ఎవరూ రాకూడదనే నిబంధనలు ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని నలుగురు వైస్‌ప్రిన్సిపాల్ వద్దకు వచ్చి దాడికి యత్నించారు. దీని వెనుక ఎవరి హస్తమైనా ఉందా? లేదా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఇదే విషయాన్ని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శివరాంప్రసాద్.. ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. అంతేకాదు.. డైరెక్టర్ ఆఫ్ కమిషనర్, వైద్య శాఖ దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఇక్కడ చోటుచేసుకున్న ఘటనపై ఫోన్ ద్వారా పూర్తివివరాలు వెల్లడించారు.

### విచారణ జరుపుతున్నాం



కళాశాలలో జరిగిన సంఘటనపై విచారణ చేపట్టాం. నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు లోనికి ప్రవేశించి వైస్ ప్రిన్సిపాల్‌పై దాడికి యత్నించారు. ఇదే విషయంపై ఎస్పీకి ఫిర్యాదు చేశాం. ఆస్పత్రి సిబ్బందికి గదులు కేటాయించాలనే నిబంధన ఏదీలేదు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై తదుపరి చర్యలు తీసుకుంటాం.
– శివరాంప్రసాద్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

## క్లుప్తంగా

### వీరాభిమానికి అభినందన



మంత్రికి చిత్రపటం ఇస్తున్న వెంకటేశ్

**ధర్మపురి:** రాష్ట్రమంత్రి కొప్పుల ఈశ్వర్ చేస్తున్న ప్రజాసేవకు మంత్రముగ్ధుడైన జగిత్యాల రూరల్ మండలం సంగంపెల్లికి చెందిన యువ చిత్రకారుడు గుగ్గిల్ల వెంకటేశ్.. రెండు రోజులపాటు శ్రమించి కర్రచెక్కపై మంత్రి చిత్రపటం చిత్రించాడు. గురువారం ధర్మపురి పట్టణంలో జరిగిన కంటి వెలుగు కార్యక్రమంలో ఆ చిత్రపటాన్ని మంత్రికి అందజేసి తన అభిమానం చాటుకున్నాడు. ఆ వీరాభిమానిని మంత్రి కొప్పుల అభినందించారు.

### వాహనాల దారిమళ్లింపు



వాహనాలను దారి మళ్లిస్తున్న పోలీసులు

**కోరుట్లరూరల్:** నిజామాబాద్– కరీంనగర్ – వరంగల్ మార్గంలోని వాహనాలను పోలీసులు గురువారం దారి మళ్లించారు. వాటిని వేములవాడ మార్గంలోకి మళ్లించారు. మాస్టర్ ప్లాన్‌కు వ్యతిరేకంగా జగిత్యాల పట్టణంలోని జాతీయ రహదారిపై ఆందోళనకారులు ధర్నాలు, రాస్తారోకోలు, వంటావార్పు చేపట్టారు. దీంతో ట్రాఫిక్ పెద్ద ఎత్తున స్తంభించింది. ఫలితంగా 68 నంబరు జాతీయ రహదారిపై వాహనాలను క్రమబద్ధీకరించేందుకు కోరుట్లలోని నంది చౌరస్తా సిగ్నల్ వద్ద కరీంనగర్ వెళ్లే వాహనాలను వేములవాడ మీదుగా కరీంనగర్‌కు దారి మళ్లించారు. సుమారు రెండు గంటలపాటు ఈ ప్రక్రియ కొనసాగింది. ఆ తర్వాత యథావిధిగా జగిత్యాల వైపు వెళ్లాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సతీశ్‌కుమార్, ఏఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

### వేశ్యాగృహాలపై పోలీసుల దాడులు

- ముగ్గురు మహిళలకు విముక్తి
- ఇద్దరిపై కేసు : డీఎస్పీ ప్రకాశ్

**జగిత్యాలక్రైం:** జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ వేశ్యా గృహాలపై డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో 10 పోలీసు బృందాలు ఏకకాలంలో దాడులు చేశాయి. వేశ్యా గృహాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. వ్యభిచార కూపంలో మగ్గుతున్న ముగ్గురు మహిళలను గుర్తించి సఖీ కేంద్రానికి తరలించారు. మహిళలతో బలవంతంగా వ్యభిచారం నిర్వహిస్తున్న ప్రతాప్‌తోపాటు అతడి భార్యపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. దాడుల్లో పట్టణ సీఐ కిశోర్, రూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్సైలు సంజీవ్, రహీం, అనిల్, రాము, శ్వేత పాల్గొన్నారు.

### మద్యం దుకాణాల్లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న అధికారులు

**ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని మద్యం షాపులను గురువారం ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలని సూచించారు. ఎవరైన ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి రాథోడ్, మంథని సీఐ గురువయ్య తదితరులు ఉన్నారు.

# ప్రకృతి వైద్యంపై అవగాహన లక్ష్యం

- యోగాపైనా జిల్లావాసులకు అవగాహన
- 'ఆయుష్'కు అనుబంధంగా ఆరోగ్య స్వచ్ఛత కేంద్రాలు
- ఆయుష్మాన్ భారత్ కింద జిల్లాలో 13 కేంద్రాల నిర్మాణం

**జగిత్యాలజోన్:** ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఐదు సంప్రదాయ వైద్య విధానాలకు పూర్వవైభవం తెచ్చేందుకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఇందులో ఆయుర్వేదం, యోగా, ప్రకృతి చికిత్స, యునానీ, సిద్ధా, హోమియోపతి వైద్య సేవలు ఉన్నాయి. ఈ మేరకు, జిల్లాలోని ఆయుర్వేద, యునానీ, హోమియాపతి వైద్యశాలలకు పెద్దపీట వేసేందుకు వాటికి అనుబంధంగా ఆరోగ్య స్వచ్ఛత కేంద్రాలు తీసుకొచ్చాయి. దీర్ఘకాలిక వ్యాధులకు వీటి ద్వారా పరిష్కారం లభిస్తుండటంతో బాధితులు అటువైపు దృష్టి సారించారు. దీంతో ఆయుష్ ఆస్పత్రులకు డిమాండ్ పెరుగుతోంది.

**ఆయుష్ కేంద్రాల్లో ఆరోగ్య స్వచ్ఛత కేంద్రాలు..**

- జిల్లాలోని 13 కేంద్రాల్లో ఇప్పటికే ఆయుష్ సేవలు అందుతున్నాయి.
- వీరీరావుపేట, వెల్లుల్ల, బండ లింగాపూర్, చిల్లకోడూర్, ఎండపల్లి, కొడిమ్యాల, మేడిపల్లి, అల్లీపూర్, బతికెపల్లి, ధర్మపురి, కోరుట్ల, లక్ష్మీపూర్, మల్యాల తదితర ప్రాంతాల్లో ఆయుర్వేద, హోమియా, యునానీ ఆస్పత్రులు సేవలు అందిస్తున్నాయి.
- ఆయుష్ వైద్యశాలలకు అనుబంధంగా కేంద్ర ప్రభుత్వం, రాష్ట ప్రభుత్వ సహకారంతో ఆయుష్ ఆస్పత్రులు ఉన్నచోట ఆరోగ్య స్వచ్ఛత కేంద్రాలు(వెల్‌నెస్ సెంటర్‌లు) ఏర్పాటు చేస్తోంది.



లక్ష్మీపూర్‌లోని ఆరోగ్య స్వచ్ఛత కేంద్రం

- ఇప్పటికే, చాలాచోట్ల వీటి నిర్మాణాలు పూర్తయ్యాయి.
- మరికొన్నిచోట్ల ప్రగతి దశలో ఉన్నాయి.
- ఒక్కో కేంద్రం కోసం రూ.6 లక్షలు వెచ్చించి రేకుల షెడ్లు నిర్మిస్తున్నారు.
- ఇందులో ఒకేసారి కనీసం 50 మంది కూర్చుండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.
- ఫ్యాన్లతో పాటు విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నారు.

**ప్రజాఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి..**

మనిషి బతికినంతకాలం ఆరోగ్యంగా ఉండాలనేదే ఆరోగ్య స్వచ్ఛత కేంద్రాల ప్రధాన లక్ష్యం. మనసు, శరీరం, ఇతర ఇంద్రియాలను అదుపులో ఉంచేలా ఈ కేంద్రాలు పనిచేయాలన్నది ప్రధాన ఉద్దేశం. ప్రజల జీవనశైలి రోజురోజుకూ మారుతోంది. అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఈ సమస్యలకు యోగా ద్వారా పరిష్కారం చూపాలని, గ్రామీణ కేంద్రాల ద్వారా పల్లెవాసులకు యోగా మరింత చేరువ చేయాలని అధికార యంత్రాంగం ముందుకు సాగుతోంది. దీనిపై ఇప్పటికే వివిధ రకాల శిక్షణలు ఇస్తున్నారు.

**ఆయుష్ సేవలకు ప్రాచుర్యం కల్పించేలా..**

- ఇప్పటికే అందిస్తున్న ఆయుష్ సేవలకు ప్రాచుర్యం కల్పించేలా స్వచ్ఛత కేంద్రాలు పనిచేయనున్నాయి.

డాక్టర్ చేసిన వైద్య చికిత్సతో ఒక వ్యాధి నయం అయినా మరోటి పట్టి పీడిస్తే.. అది సరైన వైద్య విధానం కాదని ఆయుష్ చెబుతోంది.

- పేషెంట్‌కు చికిత్స ఎంత ముఖ్యమో, ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని ఆయుర్వేద వైద్య చికిత్స విధానం సూచిస్తోంది.
- అలాగే, మందులు లేకుండా వ్యాధులను నయం చేసేదే యోగా, ప్రకృతి వైద్య విధానమని పేర్కొంటోంది.
- మనిషి తనలోని ప్రాణ శక్తిని ఉత్తేజపరిచేలా యోగా చికిత్స పనిచేస్తుందని వైద్యులు అంటున్నారు.
- ఇంకా, సైన్స్, ఆరోగ్య సూత్రాల కలయికే యునానీ వైద్యం అని వివరిస్తున్నారు.
- యునానీ వైద్యం వ్యాధి తగ్గించడాన్ని కాకుండా సంపూర్ణ వ్యక్తిత్వాన్ని పెంపొందిస్తుందని అంటున్నారు.
- హోమియోపతిలో ఏ వస్తువు అయితే వ్యాధి లక్షణాలను కలగజేస్తుందో, అదే వస్తువు అలాంటి లక్షణాలు కలిగిన వ్యాధిని నయం చేస్తుందని భావిస్తున్నారు.
- ఇలాంటి వైద్య విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కూడా ఈ కేంద్రాలు పనిచేస్తాయని జిల్లా వైద్యశాఖ ప్రకటించింది.

**ఆయుష్‌సే వలుచేరువ**

ఆయుష్ వైద్యశాలలకు అనుబంధంగా ఆరోగ్య స్వచ్ఛత కేంద్రాలు ఏర్పాటు అయ్యాయి. వీటిలో నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. రాబోయే రోజుల్లో వీటి ద్వారా ప్రజలు.. ముఖ్యంగా గర్భిణులకు అవసరమైన సేవలు అందిస్తాం. యోగాను ప్రజలకు తెలియజేసేందుకు, సమస్యలకు పరిష్కారం చూపేందుకు స్వచ్ఛత కేంద్రాలు పనిచేస్తాయి.

– మనోహర్‌రెడ్డి, ఆయుష్ నోడల్ ఆఫీసర్, జగిత్యాల

# వాహన దొంగల అరెస్ట్

- రూ.2.70లక్షల విలువైన వాహనాలు స్వాధీనం

**మల్యాల(చొప్పదండి):** ఆటో, రెండు మోటార్లు సైకిళ్లు దొంగిలించిన ముగ్గురు దొంగలను అరెస్టు చేశారు. వారినుంచి రూ.2.70లక్షల విలువైన వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని మారేడుపల్లికి చెందిన బాలుడిపై వివిధ పోలీసుస్టేషన్లలో సెల్‌ఫోన్, ఆటో చోరీ కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే ఆ బాలుడు రెండుసార్లు జువైనల్ హోమ్‌కు వెళ్లి 15 రోజుల క్రితం విడుదలయ్యాడు. ఈనెల 16న మెట్‌పల్లికి చెందిన కామ శ్రీనివాస్ కొండగట్టు దర్శనం కోసం వచ్చి, పార్కింగ్ చేసిన బైక్‌ను ఆ బాలుడు చోరీ చేశాడు. అదేబైక్‌పై తిరుగుతూ ఈనెల 17న జగిత్యాలకు చెందిన అయాజొద్దీన్ ఆటోను కొండగట్టు బస్టాండ్ వద్ద పార్కింగ్ చేయగా దానిని సైతం దొంగిలించాడు. పోలీసులు గురువారం దొంగలమర్రి చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా బైక్‌ను ఆటోలో వేసుకుని హైదరాబాద్ వెళ్తున్న మైనర్ పట్టుబడ్డాడు. సుమారు రూ.2లక్షల విలువైన ఆటో, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

**రాజారం బైక్ దొంగల పట్టివేత..**

రాజారం గ్రామంలో ఈనెల 16న బత్తుల చంద్రయ్య తన బంధువు శివరాత్రి అంజయ్య ఇంటి ఎదుట బైక్ పార్కింగ్ చేయగా, జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన పడాల దినేశ్, షేక్ అర్షద్‌ఖాన్ బైక్‌ను దొంగిలించారు. వీరు ఇద్దరు కొంతకాలంగా ఇంటి ఎదుట, రోడ్లపై పార్క్ చేసిన వాహనాలు ఎత్తుకెళ్తున్నారు. గురువారం పోలీసులు మల్యాల అడ్డరోడ్డు వద్ద చేపట్టిన వాహనాల తనిఖీల్లో ఇద్దరూ పట్టుబడ్డారు. వీరినుంచి రూ.70వేల విలువైన బైక్ స్వాధీనం చేసుకున్నారు. వాహనాల తనిఖీలో సీఐ రమణమూర్తి, ఎస్సై చిరంజీవి, హెడ్‌కానిస్టేబుల్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

# శభాష్.. జెడ్పీ సీఈవో

- ఎంఏయూడీ డిప్యూటీ డైరెక్టర్ పేరుతో ఫోన్‌కాల్స్
- జిల్లా పరిషత్‌కు నిధులిస్తామని కేటుగాళ్ల ఎర
- కరీంనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రియాంక

**సాక్షి ప్రతినిధి, కరీంనగర్:** 'నేను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) నుంచి మాట్లాడుతున్నాను. ఎంఏయూడీలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాను. కరీంనగర్ జిల్లాకు నిధుల అవసరం ఉందా? ఉంటే మాకు చెప్పండి. కావాలిస్సనన్ని నిధులు మంజూరు చేస్తాం. మీరు అడిగినన్ని నిధులు మంజూరు చేస్తాం కాకపోతే, మీరు నాకు కొంత కమీషన్ ముట్టజెప్పాల్సి ఉంటుంది.' ఇదీ.. కరీంనగర్ జెడ్పీ సీఈవో ప్రియాంకకు వచ్చిన ఫోన్ కాల్. గురువారం ఉదయం 73867 19629 నెంబరు నుంచి కాల్ రాగా.. తొలుత ఎంఏయూడీ నుంచి వచ్చినట్లుగానే భావించారు. కానీ.. డిప్యూటీ డైరెక్టర్‌గా తనను తాను పరిచయం చేసుకున్న తీరు, నిధుల ప్రస్తావనపై అనుమానం కలిగింది. నిధులు కావాలంటే.. ఇలా ఎవరూ ఫోన్ కాల్స్ చేయరని గ్రహించిన ఆమె అతను చెప్పింది విన్నారు. కానీ.. ఎక్కడా అతని మాటలకు తొందరపడలేదు. అతను మోసగాడని గ్రహించి ఏమేం కావాలో అడిగారు. దీంతో అతను ముందుగా త నకు కమీషన్ కింద డబ్బులు వేయాలని సూచించడంతో సరే అని ఫోన్ పెట్టేశారు.వెంటనే విషయాన్ని పోలీసుల కు ఉన్నతాధికారులకు ఫి ర్యాదు చేశా రు. ఈ నెంబరు నుంచి కరీంనగర్ జెడ్పీ సీఈవో ప్రి యాంకకే కాకుండా.. రాష్ట్రంలోని పలువురు ము న్సిపల్, జిల్లా చైర్‌పర్సన్లకు కూడా కాల్స్ వెళ్లినట్లు తెలిసింది. వెంటనే ఈ విషయాన్ని మున్సిపల్, జిల్లా పరిషత్ అధికారులకు వాట్సాప్ సందేశం ద్వారా ఆయా విభాగాల అధికారులు హెచ్చరించారు. ఈ విషయంలో కొసమెరుపు ఏంటంటే.. జెడ్పీ సీఈవో నుంచి ఫేక్ కాల్ విషయంపై ఫిర్యాదు రాగానే.. పోలీసులు సదరు నెంబరు వివరాలపై ఆరా తీస్తున్నారు. ట్రూ కాలర్‌లో ఆ నెంబరు శ్రీకాంత్, డీడీ, ఎంఏయూడీ అని ఫీడ్ చేసి ఉండటం గమనార్హం. ఇటీవల మే నెలలో జగిత్యాల జిల్లా మల్యాల తహసీల్దార్, ఎస్సైలకు ఏసీబీ డీఎస్పీ పేరిట సైబర్ కేటుగాడు ఫోన్ చేసి రూ.10 లక్షలు డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. కరీంనగర్ కమిషనరేట్‌లో సైబర్, ఆన్‌లైన్ ఫ్రాడ్ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. 2021లో కేవలం 34 కేసులు నమోదు కాగా, 2022లో 86 కేసులు రికార్డయి సైబర్ నేరాలు రెట్టింపయ్యాయి. ఇలాంటి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీపీ సత్యనారాయణ ప్రజలకు సూచించారు.



ప్రియాంక

# బహుజనుల ఐక్యతతోనే బతుకులు మారుతాయి

- బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**మల్యాల(చొప్పదండి):** బీసీ, ఎస్టీ, ఎస్టీ, మైనారిటీ, బలహీన వర్గాలు ఐక్యం కావాలని.. రాజ్యాధికారంతోనే బహుజనుల బతుకులు మారుతాని బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం పాదయాత్ర నిర్వహించారు. నూకపల్లిలో పాదయాత్ర ప్రారంభించి, బల్వంతాపూర్, సర్వాపూర్, మానాలలో జెండాలు ఆవిష్కరించారు. రాత్రి 8 గంటల అనంతరం మల్యాల మండల కేంద్రంలో పర్యటించారు. బహుజనుల బతుకులు మార్చేందుకు ప్రవీణ్‌కుమార్ రాజకీయాల్లోకి వచ్చారని, బహుజనులు బీఎస్పీ బాటలో నడవాలని పలువురు వక్తలు కోరారు. అనంతరం ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అన్నివర్గాలకు బహుజన సమాజ్ పార్టీ జెండా పట్టడం ఒక్కటే మార్గమన్నారు. దోపిడీ నుంచి విముక్తి చేసి, బహుజన రాజ్యాధికారం సాధించేందుకు అందరూ కలిసి రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



మల్యాల పాదయాత్రలో బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

# హుషారుగా 'అలోహ'



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మనోహర్‌రెడ్డి, ప్రశాంత్



నృత్యం చేస్తున్న విద్యార్థులు

**కరీంనగర్‌రూరల్:** బొమ్మకల్ బైపాస్‌లోని ట్రినిటి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అలోహ కార్యక్రమాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆటపాటలుండాలనే ఉద్దేశంతో అలోహ పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళా శాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగేంద్రసింగ్, ఏవో రాధాకృష్ణ, హెచ్‌వోడీలు ప్రవీ ణ్‌కుమార్, బలరాం, శ్రీధర్, సంపత్, కిశోర్ పాల్గొన్నారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**రామడుగు(చొప్పదండి):** మండలంలోని షానగర్ గ్రామానికి చెందిన రైతు మినుకుల సత్తయ్య (57) అప్పుల బాధతో గురువారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. సత్తయ్య తనకున్న మూడెకరాలకు పైగా భూమిలో భూమిని చదును చేయుటకు రూ.10 లక్షలు అప్పుగా తీసుకువచ్చి చదను చేశాడు. పంట సాగు చేయగా నష్టం రావడంతో అప్పులు తీర్చడంపై మనోవేదనకు లోనయ్యాడు. జీవితంపై విరక్తి చెంది తన వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు. సమీపంలోని రైతులు చూసి సత్తయ్య కు మారుడు సంపత్‌కు తెలియజేయగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతిచెందిన సత్తయ్య

### అనారోగ్యం భరించలేక..

**ఇల్లందకుంట(హుజూరాబాద్):** మండలంలోని లక్ష్మాజీపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఉప్పుల తిరుపతిరెడ్డి (57) గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు, పోలీసుల వివరాలు.. కొన్ని రోజుల నుంచి తిరుపతిరెడ్డి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో తీవ్రంగా మనస్తాపం చెంది జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు అమెరికాలో స్థిరపడ్డాడు. చిన్నకుమారుడు శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### చికిత్స పొందుతూ ఎఫ్‌సీఐ ఉద్యోగి మృతి

**కరీంనగర్‌రూరల్:** కరీంనగర్– చొప్పదండి ర హదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎఫ్‌సీఐ ఉద్యోగి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి చెందిన ధరావత్ సంపత్(34) కరీంనగర్‌లోని కట్టారాంపూర్ నివాసముంటూ ఎఫ్‌సీఐ టెక్నికల్ అసిస్టెంట్‌గా నగునూరు గోదాముల్లో పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం 9.30గంటలకు సంపత్ కరీంనగర్ నుంచి నగునూరుకు ద్విచక్రవాహనంపై గోదాముకు వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి 10.30గంటలకు మృతిచెందాడు. గురువారం మృతుడి భార్య దివ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**తిమ్మాపూర్(మానకొండూర్):** కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎల్ఎండీ మహాత్మానగర్ చెందిన మహమ్మద్ అన్వర్ (51) తన ఎక్సెల్ బైక్‌పై తిమ్మాపూర్ నుంచి కరీంనగర్ వెళ్తుండగా అల్గునూర్ బ్రిడ్జి వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈప్రమాదంలో అన్వర్ బైక్ నుంచి కిందపడ్డాడు. ఢీకొట్టిన వాహనం అన్వర్ తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న సీఐ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు.

### జపాన్‌లో నర్సింగ్ ఉద్యోగాలు

**సిరిసిల్లకల్చరల్:** తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో స్పెసిఫైడ్ స్కిల్డ్ వర్కర్స్ కింద జపాన్‌లో నర్సింగ్ సిబ్బందిని నియమించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి నీల రాఘవేందర్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఇటీవల నిర్వహించిన స్క్రీనింగ్‌టెస్ట్‌లో అర్హత సాధించిన 25 మందికి ప్రత్యేక శిక్షణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. రెండో బ్యాచ్ అభ్యర్థుల కోసం ఈ నెల 21న స్క్రీనింగ్‌టెస్ట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. జగిత్యాల ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో జరిగే ఈ పరీక్షకు హాజరయ్యే నర్సింగ్ గ్రాడ్యుయేట్లు ఉదయం 10 గంటల్లోపు కళాశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు జపనీస్ భాషపై రెసిడెన్షియల్ శిక్షణ, అదనంగా వృత్తిపరమైన నైపుణ్యాలలో మెలకువలు నేర్పనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు www.tomcom.telangana.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 99519 09863లో సంప్రదించాలని సూచించారు.

### యువకులను పోలీసులకు అప్పగించిన స్థానికులు

**గోదావరిఖని:** వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు యువకులను పట్టుకుని స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గురువారం ఉదయం పూట తాళాల గుత్తులు, కత్తితో స్థానిక జవహర్‌నగర్ ఏరియాలో తిరుగుతున్న ఇద్దరిని స్థానికులు గుర్తించారు. పట్టుకుని తాళ్లతో కట్టేసి చితకబాది పోలీసులకు అప్పగించారు. మద్యం సేవించి ఉన్న వీరిద్దరు మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన వారిగా తెలుస్తోంది. పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. గతంలో పలు ఇళ్లలో దొంగతనాలు జరిగిన నేపథ్యంలో వీరే ఈ పని చేసిఉంటారనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

# బతుకమ్మ చీరల్లో నాణ్యత పాటించాలి

**సిరిసిల్లఅర్బన్:** బతుకమ్మ చీరల తయారీలో నాణ్యత పాటించి, కాటన్ వస్త్రపరిశ్రమను పునరుద్ధరించాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో–కన్వీనర్ ఆడేపు రవీందర్ కోరారు. సిరిసిల్లలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏటా రూ.330 కోట్లతో కోటి బతుకమ్మ చీరలను తయారు చేయించి మహిళలకు అందజేస్తుందన్నారు. బతుకమ్మ చీరలు పాలిస్టర్‌తో ఉత్పత్తి చేయడంతో మహిళలు వాటిని ధరించేందుకు సుముఖత చూపడం లేదని పేర్కొన్నారు. కాటన్ చీరల తయారీని పునరుద్ధరిస్తే కాటన్ పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిరిసిల్ల చేనేత కార్మికులకు ప్రభుత్వం బాసటగా నిలవాలని, 10హెచ్‌పీ వరకు ఉచిత విద్యుత్‌ను అందజేయాలని కోరారు. బీజేపీ నాయకులు నాగుల శ్రీనివాస్, సదానందం, భాస్కర్, రాహుల్, ఇంజపురి మురళీ, తడుక విజయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆడేపు రవీందర్

# భక్తిశ్రద్ధలతో మార్కండేయ యాగం

- భారీగా తరలివచ్చిన భక్తులు
- ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించిన వైనం

**సిరిసిల్లకల్చరల్:** మార్కండేయ జయంతి వేడుకల నేపథ్యంలో రోజుకో ఆలయంలో మార్కండేయ మహాయజ్ఞాలు నిర్వహిస్తున్నారు. గురువారం బీవైనగర్‌లోని హనుమాన్‌మందిరంలో నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ అతిథులుగా హాజరయ్యారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు దార్నం అరుణ, ఆడెపు సౌజన్య, గెంట్యాల శ్రీనివాస్, పట్టణ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, ప్రతినిధులు గాజుల బాలయ్య, మండల సత్యం, కోడం శ్రీనివాస్ మాజీ చైర్‌పర్సన్ ఆడెపు రవీందర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సీనియర్ నాయకులు బొల్లి రామ్మోహన్, రాపెల్లి కల్యాణ్ పాల్గొన్నారు.



మార్కండేయ యాగంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ తదితరులు